క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం

కూకట్‌పల్లి: ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ 4వ ఫేజులోని మల్లీపర్వస్ ఫంక్షన్‌హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు తమ ట్రస్టు ద్వారా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ శిబిరం ఏర్పాటు చేశానన్నారు.
25కెకెపి08

కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటేష్

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా డి.వెంకటేష్‌ను నియమిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కిషన్‌కుమార్ ఏసీపీగా పదోన్నతి పొందడంతో, అతని స్థానంలో అక్కడే డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌ను ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

బీటీరోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు 20 లక్షల రూపాయల ఎమ్మెల్యే నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శివప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలు ముగిశాయి. శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు దేశవ్యాప్తంగా ఈ ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. హెచ్‌సీయూలోని 308 పీహెచ్‌డీ సీట్ల కోసం 5,830 మంది ప్రవేశ పరీక్ష రాశారు. హెచ్‌సీయూ ఫ్యాకల్టీ, అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించినందుకు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ అధికారులు, ఉద్యోగులు, ఫ్యాకల్టీ ప్రతినిధులను అభినందించారు.

గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా జేమ్స్ బాబు

గచ్చిబౌలి: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా జేమ్స్ బాబును నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీలో సీఐగా పని చేస్తున్న 2007 బ్యాచ్‌కు చెందిన బి.జేమ్స్ బాబు గచ్చిబౌలి పీఎస్‌కు బదిలీ అయ్యారు. గచ్చిబౌలి ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన గోనె సురేష్‌ను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు.

రాజేశ్వర్‌కు డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సైన్స్ కాలేజీ భూగర్భ శాస్త్రంలో ఎస్.రాజేశ్వర్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. సీనియర్ అధ్యాపకులు ప్రొ.పాండురంగారెడ్డి పర్యవేక్షణలో హైడ్రోలాజికల్ స్టడీస్ ఆఫ్ మల్లేపల్లి ఏరియా ములుగు మండల్, వరంగల్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

రాయదుర్గం: రాయదుర్గం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నీలం నరేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను కించపరిస్తే సహించేది లేదని కులమతాలకు అతీతంగా పనిచేయాలన్నారు. కౌశిక్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

కౌశిక్‌రెడ్డిపై ఎస్‌ఆర్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు

అమీర్‌పేట: ముదిరాజ్ కులస్తులను అవమానపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆదివారం ముదిరాజ్ సంక్షేమ సమితి రాష్ట్ర కార్యదర్శి గోనెల కుమారస్వామి ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగ పుత్రులు, ముదిరాజ్‌ల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అజేయ్ ముదిరాజ్‌పై దాడి చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు.

రూ.వేల కోట్లతో అభివృద్ధి చేశాం



పార్కు కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. 9వ ఫేజులో రెండున్నర ఎకరాల స్థలంలో పార్కు కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి 1 కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ దాదాపు 200 కోట్ల రూపాయల విలువ చేసే స్థలాన్ని కేవలం ప్రజల కోసం 24 గంటల్లో జీవో ఇచ్చిన మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

◆ కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రతి వీధిలో పార్కులను నిర్మించామని, అండర్‌పాస్ బ్రిడ్జిలు, జేఎన్‌టీయూ ఫ్లై ఓవర్ నిర్మాణం, కైత్లాపూర్‌లో ఫ్లై ఓవర్ వంటి నిర్మాణాలతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరాయన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చి అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో పిల్లలకు స్విమ్మింగ్ పూల్స్, షటిల్ కోర్టు, ఆహ్లాదకరమైన మొక్కలు, కమ్యూనిటీ హాల్స్‌తో 9వ ఫేజులోని రెండున్నర ఎకరాల్లో పార్కును రూపొందిస్తామని అన్నారు.

◆ హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో కేటీఆర్ ముఖ్యపాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహానగరంలో ప్రశాంతమైన వాతావరణంలో అన్నదమ్ముల్లా జీవిస్తున్నారని ఇందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ అవలంభిస్తున్న విధానాలే కారణమన్నారు. రాబోయే రోజుల్లో తిరిగి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఇంకా బాగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సతీస్ అరోరా, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్, ఏఈ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో కరచాలనం చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో ఆదివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు కార్పొరేటర్ సబిహా బేగం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీకి చెందిన యూత్ అధ్యక్షుడు సయ్యద్ మోసిన్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో 200 మంది కార్యకర్తలతో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. అల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, అల్లాపూర్ డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మొహమ్మద్ నూర్‌ఖాన్, చాంద్ సాబ్, షఫీయుద్దీన్, మహమ్మద్ మాజీద్ సయ్యద్ నిజాం, మహ్మద్ మూసా, త్రబేజ్, సయ్యద్ దస్తగిరి, షేక్ తౌఫిక్, అక్బర్, అఫ్రోజ్, మీర్జా తదితరులు పాల్గొన్నారు.





కేపీహెచ్‌బీ 9వ ఫేజులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, పాల్గొన్న ప్రజలు

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయం వార్షికోత్సవం కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు ఆంజనేయులు, ఎర్ర లక్ష్మయ్య, బాబు, చిన్న హన్మంతు, అఖిల్, రాంబాబు, భీమ్ రాజ్, నర్సింహారావు, సాంబమూర్తి, కుమారస్వామి, శ్యామ్, కనకాచారి, కాలనీవాసులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం..

కట్టమైసమ్మ దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎర్ర లక్ష్మయ్య ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మహిళా నాయకురాలు ఉప్పల విద్యాకల్పన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.



కట్టమైసమ్మ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

నృత్యగాన పోటీలు

కేపీహెచ్‌బీకాలనీ: అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని శ్రీ సౌభాగ్య లలితా పరమేశ్వరి దేవాలయం త్యాగరాజు లలితా కళాపీఠం ఆధ్వర్యంలో నృత్యగాన పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డా. ఎంఆర్‌ఎస్ రాజు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారులకు వివిధ పోటీలు నిర్వహిస్తూ వారిలోని ప్రతిభను వెలికి తీయడమే కాకుండా మింత మంది కళలను అభ్యసించే విధంగా నిర్వాహకులు కృషి చేస్తున్నారని కొనియాడారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలలో అంతర్భాగమైన కళలను ప్రతి ఒక్కరూ అభ్యసించడటం లేదా ప్రశంసించడం చేయాలని అభిలషించారు.

◆ ఎంతోమంది చిన్నారులు అద్భుతంగా పాడి, నృత్యం చేసి ఈ కార్యక్రమానికి వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగపతి రాజు, అన్నపూర్ణానంద, ప్రమీల వాణి, రమాదేవి, రేవతి, మాధురి, బాలనాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన నృత్య గాన పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

‘కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ పుంజుకుంటోంది’

జిల్లా పార్టీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి

మోతీనగర్: బీజేపీతోనే దేశం అభివృద్ధి దిశలోకి వెళ్తోందని మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పర్వత్‌నగర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ భాను ఆధ్వర్యంలో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హరీష్‌రెడ్డి మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ రోజురోజుకు పుంజుకుంటోందన్నారు. నిరంతరం ప్రజల మధ్యలో ఉంటు ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేసే నాయకులే బీజేపీ పార్టీ నాయకులని తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్ యాదవ్, పర్వత్‌నగర్ బూత్ ఇన్‌చార్జి రాజశేఖర్, నాయకులు బొంతు హరికృష్ణ, వెంకటేష్, శ్రావణ్, అంకిత్ సింగ్ పాల్గొన్నారు.



పర్వత్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను అందజేస్తున్న పన్నాల హరీష్‌రెడ్డి

ఇంటితాళాలు పగులగొట్టి ఆభరణాల చోరీ

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటితాళాలు పగులగొట్టిన గుర్తు తెలియని దొంగలు ఇంటిలోని బీరువాలో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలను దోచుకుపోయిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రవీందర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో గోకుల్ ఫ్లాట్స్‌లో నివాసముంటూ కేపీహెచ్‌బీ కాలనీలో హాట్ చిప్స్ వ్యాపారం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల కాలంలోనే తన నివాసం కూడా కేపీహెచ్‌బీలోని ఎల్‌ఐజీ గృహంలోకి మార్చాడు.

◆ అయితే శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి గోకుల్ ఫ్లాట్స్‌లోని పాత ఇంటిలోని సామాన్లు తీసుకురావటం కోసం వెళ్లాడు. అక్కడే ఉన్న తన సోదరుడి నివాసానికి కూడా వెళ్లి ఆదివారం ఉదయం తిరిగి వచ్చి చూడగా కేపీహెచ్‌బీలోని ఎల్‌ఐజీ ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పాటు ఇంట్లోని బీరువాలోగల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, కొంత నగదు కనిపించలేదు.

◆ గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సైబరాబాద్ క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించింది. కాగా రవీందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి వున్న విషయాన్ని పసిగట్టిన వారే చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

ఎంపీ రేవంత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన కృష్ణారాజ్‌పుత్, సీనియర్ నాయకుడు తూము వేణు ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ సుజ్జు బాయ్, మైసయ్య ముదిరాజ్, నర్సింహాచారి, అక్బర్, బాలరాజు, డీఆర్ కృష్ణ, శంకర్, శివగౌడ్, రాయపాటి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ సమాచారంతో విద్యాబోధన తగదు

రాయదుర్గం: గూగుల్‌లో సెర్చ్‌చేసి పొందే సమాచారంతో విద్యాబోధన చేయడం తగదని ప్రముఖ గణిత విద్యావేత్త, పద్మశ్రీ ఆనంద్‌కుమార్ అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో శనివారం రాత్రి హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని హోటల్ కోహినూర్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నిజమైన, నిక్కచ్చి విద్యను అందించాలన్నారు. విద్యావిధానంలో మాఫియాలు పుట్టుకొచ్చాయని, దీంతో తన సూపర్–30 ప్రోగ్రాం నడిపించడం క్లిష్టంగా మారిందన్నారు. తనను హత్య చేస్తామనే బెదిరింపులు వచ్చాయని, తమ బోధనేతర సిబ్బందిని కత్తితో పొడిచారని, కోచింగ్ సెంటర్లకు ఫీజులు చెల్లించలేని ఐఐటీల కోసం నిరుపేద పిల్లలకు శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సూపర్–30 సక్సెస్ అయిందన్నారు. ఈ సూపర్–30లో ఎక్కువ సంఖ్య అమ్మాయిలే ఉండేలా చూడాలన్నది తన సంకల్పమన్నారు. ఎఫ్ఎల్ఓ చైర్ పర్సన్ రీతూషా మాట్లాడుతూ.. ప్రపంచంలో దేనినైనా మార్చగల శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమే అన్నారు.

టీ-9 గోల్ఫ్ చాలెంజ్‌లో రైడర్స్ శుభారంభం

సాక్షి, సిటీబ్యూరో: యువ గోల్ఫర్లను ప్రోత్సహించేందుకు టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న టీ–9 చాలెంజ్ గోల్ఫ్ టోర్నీ రెండో సీజన్ ప్రారంభమైంది. తొలిరోజు బీహెచ్‌జీసీసీ రైడర్స్ టీమ్ శుభారంభం చేసింది. ఆరంభ మ్యాచ్‌లో రైడర్స్ 3–1 స్కోర్‌తో బౌల్డర్ నింజాస్‌పై విజయం సాధించింది. రైడర్స్ టీమ్‌లో దేశాంత్ కైలా, ఆండ్రూ వుడ్, డి.తరుణ్, వేణు పాలినేని చక్కని ఆటతీరు కనబరిచారు. కాగా డిఫెండింగ్ చాంపియన్స్ బౌల్డర్ హిల్స్ టైగర్స్, నోవాటెల్ స్టార్స్‌తో మ్యాచ్‌ను 2–2తో డ్రాగా ముగించింది. టైగర్స్ టీమ్ ప్లేయర్ అలిన్ యామిన్ మరోసారి అద్భుత ఆటతీరుతో ఓటమిని తప్పించారు. మిగిలిన మ్యాచ్‌లలో సిమెట్రిక్స్ ఎకోలాస్టిక్ ఈగల్స్‌పైనా, జాగృతి జాగర్స్ టీజీఎఫ్ బ్యాక్ స్పిన్నర్స్‌పైనా విజయం సాధించాయి.

జర్నలిస్ట్ తులసి చందును బెదిరించడం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: స్వతంత్ర జర్నలిస్ట్ తులసి చందును బీజేపీ నాయకులు చంపుతామని బెదిరించడం సరికాదని ఓయూ విద్యార్థి నేతలు పేర్కొన్నారు. ఆదివారం దళిత బహుజన, వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు తులసి చందుకు మద్దతుగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. దేశంలో బీజేపీ చేస్తున్న మత రాజకీయాలు, మోసాలను నిర్భయంగా ప్రచారం చేస్తున్న తులసి చందును చంపుతామని సోషల్ మీడియాలో బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆమెకు ఏమైనా జరిగితే బీజేపీ నాయకులదే బాధ్యత అని హెచ్చరించారు. విద్యార్థి నాయకులు వేల్పుల సంజయ్, తిరుపతి, వేణుగోపాల్, జంగిలి దర్శన్, మున్నా, రెహమాన్, వలిగొండ నర్సింహ, సుమంత్, అజయ్ సతీష్ పాల్గొన్నారు.



నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

కేపీహెచ్‌బీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దశాబ్ద కాలం గడిచినా ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలల వరకు పూర్తిగా విద్యను నిర్వీర్యం చేసినందుకు నిరసనగా ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ కమిటీ మెంబర్ సునీల్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గతంలో కేజీ టు పీజీ విద్య ఉచితం అంటూ ప్రకటించిన హామీని అమలు చేయకుండా 8,624 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేవని తెలిపారు. 6,800 ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఉన్నారని, 596 మండలాల్లో 578 మండలాలకు విద్యా అధికారులు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ గతంలో మన ఊరు మన బడి కార్యక్రమానికి 7 కోట్ల నిదులు కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తామని హామీలతో చేతులు దులుపుకొని మళ్లీ ఇప్పుడు మరొక నాటకంతో తెరైకి వచ్చి మళ్లీ 3,500 కోట్లతో పాఠశాలల అభివృద్ధి అంటూ హడావుడి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 15 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని భర్తీ చేయకుండా మౌలిక వసతులు కల్పిస్తే ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థికి ఏ విధంగా నాణ్యమైన విద్య అందుతుందని ప్రశ్నించారు.

◆ ప్రభుత్వ పాఠశాలలను గాలికి వదిలేసి, లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వం ఏ విధమైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇకనైనా విద్యార్థుల జీవితాల పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా అక్రమంగా నడుస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన 6 లక్షల రూపాయల నిధులను లబ్ధిదారులకు ఆదివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అదే విధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరంతరం సేవలు అందిస్తు ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పోతులు రాజేందర్, సద్దాం, శ్రావణిరెడ్డి, విమల, రేణుక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ కాంపిటీషన్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలి

టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపీటీషన్‌లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని టీపీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు కోరారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

◆ ముఖ్యంగా మహిళలకు మొదటి బహుమతిగా ఈ స్కూటీ అందిస్తామన్నారు. మొదటి బహుమతిగా ల్యాప్‌టాప్, రెండో బహుమతిగా స్మార్ట్‌ఫోన్, మూడో బహుమతిగా ట్యాబ్లెట్ ఇలా బహుమతులు ఉంటాయని తెలిపారు.

◆ జూలై 2వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ ఉంటుందని రిఫరల్ కోడ్ జీవీఆర్ 46 ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రేషన్, వెబ్‌సైట్ లింక్ కోసం 7661899899 నంబర్‌కు మిస్ కాల్ ఇవ్వాలని కోరారు. గతంలో బీజేపీ ప్రభుత్వం బ్లాక్ మనీని వెలికితీసి ప్రతి మనిషికి రూ.15 లక్షల రూపాలయను వారి అకౌంట్‌లో వేయిస్తామని నమ్మించి మోసం చేశారన్నారు. అలాంటి పార్టీకి రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేంద్ర, ఎన్ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ సయ్యద్ విస్సా, డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, వర్కింగ్ ప్రసిడెంట్ అస్లాం, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్, సీనియర్ నాయకులు రాజేందర్, ఆనంద్, సుధాకర్‌రెడ్డి, మోయిజ్, రియాజ్, గుడ్డుబాయి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గొట్టిముక్కల వెంగళరావు

పేదలకు ‘డబుల్’ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకుల డిమాండ్



కేపీహెచ్‌బీకాలనీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కూకట్‌పల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ రోడ్డు నం.1 గాంధీ విగ్రహం వద్ద ఆదివారం రిలే నిరాహార దీక్షలు చేశారు. ఈ దీక్షలో ప్రజా సంఘాల నాయకులు ఎం. శంకర్, సీఐటీయూ కూకట్‌పల్లి మండల కార్యదర్శి కృష్ణ నాయక్, ఎస్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, మహిళా సంఘం నాయకురాలు నర్సమ్మ, విజయ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రంజిత్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా పేదలకు సొంత ఇల్లు లేకపోవడం పేదల పట్ల పాలకుల విధానం ఏమిటో స్పష్టం అవుతోందన్నారు.

◆ ప్రతి ఒక్కరికి తినడానికి తిండి, కట్టుకోవటానికి గుడ్డ, ఉండడానికి ఇళ్లు కల్పించాలని బాధ్యత రాజ్యాంగ స్ఫూర్తిని పాలక ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒక ఇల్లు కూడా మంజూరు చేయాలేదన్నారు. ఇల్లులేని పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

◆ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రతి ఒక్కరికి డబుల బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం హామి ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇళ్లస్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, నరసింహారావు, రాములు, రాఘవరావు, సిపిఐ మండల నాయకులు యు. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.